క్లుప్తంగా

వలంటీర్లపై బురద చల్లడం మానుకోవాలి


కమిడి మోహన్‌చంద్ర, న్యాయవాది

ఏలూరు (టూటౌన్): పింఛన్ల విషయంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి వలంటీర్లపై బురద చల్లడం మానుకోవాలని న్యాయవాది కమిడి మోహన్‌చంద్ర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల్లో భాగంగా వృద్ధాప్య, దివ్యాంగులు తదితర పింఛన్ల చెల్లింపు విషయంలో జాప్యానికి ఆ మూడు పార్టీలే కారణమన్నారు. ఆ పార్టీలు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం వల్లే వలంటీర్లు పింఛన్ల పంపిణీకి దూరంగా ఉండాల్సి వచ్చిందని తెలిపారు. దేశంలో గొప్పగా పేరుపొందిన వలంటీర్ వ్యవస్థపై దిగజారుడు రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు. ఎన్నికల్లో ఓడిపోతామనే అభద్రతా భావంతోనే ఇటువంటి పరిస్థితులు రాష్ట్రంలో కల్పించడం సరికాదని వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన వారి అభివృద్ధి, సంక్షేమానికి చేపట్టిన పథకాలను పునరుద్ధరింపచేయాలన్నారు. ఇప్పటికే ఓటర్లు ఎవ్వరికి ఓటు వేయాలో నిర్ణయించుకున్నారని, ఎన్ని ప్రలోభాలు పెట్టినా ఓటర్లు అనుకున్న వారే విజయం సాధిస్తారని న్యాయవాది మోహన్‌చంద్ర అన్నారు.

సాగునీటి విడుదలకు కృషి


పాలగూడెంలో పంటచేలు పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం దెందులూరు నియోజకవర్గం పాలగూడెం గ్రామ పరిసరాల్లో పంటచేలకు సాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామని వ్యవసాయశాఖ అధికారి అబిబ్ బాషా అన్నారు. బుధవారం ఏడీఓ సుబ్బారావు, ఏఓ జీవనసంధ్యతో కలిసి పాలగూడెంలో పంటచేలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు వరి పాలు పోసుకునే దశలో ఉందని, ఈ దశలో నీరు అందకపోతే దిగుబడి తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి లేదా కృష్ణా కెనాల్ నుంచి సాగునీరు విడుదల చేయించాలని కోరారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సాగునీరు విడుదల చేసేందుకు కృషి చేస్తామని అబిబ్ బాషా రైతులకు భరోసా ఇచ్చారు.

రూ. 92 వేలు పట్టివేత

దెందులూరు: దెందులూరు మండలంలో జాతీయ రహదారిపై సోమవరప్పాడు వద్ద బుధవారం తనిఖీ చేస్తున్న ఎస్సై కె.స్వామి ద్విచక్ర వాహనదారుడి నుంచి రూ. 92 వేలు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. కామవరపుకోట నుంచి ఏలూరు వస్తున్న సత్యనారాయణ వాహనాన్ని తనిఖీ చేయగా, ఎటువంటి ఆధారాలు లేని రూ. 92 వేలు నగదు ఉందని, వాటిని సీజ్ చేసి ఉన్నతాధికారులకు తెలియజేశామని తెలిపారు.


టూటౌన్ ప్రాంతంలో సచివాలయం వద్ద వృద్ధుల నిరీక్షణ


చొదిమెళ్ల సచివాలయం వద్ద పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు


తాపీమేస్త్రి కాలనీ సచివాలయానికి పింఛన్ కోసం వస్తున్న వృద్ధురాలు

పాతరోజులు తలపింఛేన్

- సచివాలయాల వద్ద పడిగాపులు
- ఏలూరులో పింఛన్లు 68.86 శాతం పంపిణీ
- కమిషనర్ వెంకటకృష్ణ, ఆర్ఓ ముక్కంటి ప్రత్యేక శ్రద్ధ


నూకాలమ్మ గుడి సమీపంలోని సచివాలయం వద్ద లబ్ధిదారుల పడిగాపులు


తాపీమేస్త్రీ కాలనీ సచివాలయంలో వృద్ధురాలి ఐరిష్ తీస్తున్న ఉద్యోగి

ఏలూరు టౌన్: పండుటాకులకు ఊహించని కష్టాలు వచ్చిపడ్డాయి. 58 నెలలపాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో హాయిగా ఇంటిలోనే ఉంటూ తెల్లవారుజామునే పింఛన్ ఠంఛన్‌గా అందుకున్నారు. కానీ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టీడీపీ అనుకూల వర్గం నీచరాజకీయాలతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సచివాలయాలకు వెళ్లి పింఛను తీసుకోవాలనే నిబంధనతో వృద్ధులకు అవస్థలు తప్పలేదు. మొత్తానికి పాత రోజులు తలపించేలా పలుచోట్ల వృద్ధులు పింఛన్ కోసం గంటలకొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది.


గన్‌బజార్ సచివాలయం వద్ద వృద్ధురాలిని లోనికి తీసుకొస్తున్న ఉద్యోగి

68.86 శాతం పంపిణీ

ఏలూరు నగరంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, ఏలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముక్కంటి ప్రత్యేకంగా పర్యవేక్షించారు. నగరంలోని ప్రతి సచివాలయానికి వెళ్లి పింఛన్ల పంపిణీ, సౌకర్యాలను పరిశీలించారు. సచివాలయం వద్ద షామియాన్ టెంట్‌లు వేయించారు. వృద్ధులకు కుర్చీలు వేసి కూర్చోబెట్టేందుకు ఏర్పాటు చేశారు. ఏలూరు నగరంలో బుధవారం సాయంత్రానికి 68.86 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. ఏలూరు అర్బన్ పరిధిలో తొలి రోజు 19,240 మందికి 13,249 పింఛన్లు పంపిణీ చేశారు. ఇక ఏలూరు రూరల్ పరిధిలో 15,515 మందికి 55.73 శాతంతో 8,646 పింఛన్లు పంపిణీ పూర్తిచేశారు.

వేడి గాలులతో అవస్థలు

ఏలూరు నగరంలో 79 సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీకి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పింఛన్ల పంపిణీ జాప్యం కారణంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు సచివాలయాల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చింది. పాత రోజులు గుర్తు చేస్తూ అనేక మంది వృద్ధులు సచివాలయాల బయట గట్లపైనా, మెట్లపైనా వేచి ఉన్నారు. వేడిగాలులు వీస్తూ ఉండడంతో అవస్థలు పడ్డారు.


గాంధీనగర్ సచివాలయంలో వృద్ధురాలి వేలిముద్ర తీసుకుంటున్న సిబ్బంది


గాంధీనగర్ సచివాలయంలో వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ అందిస్తున్న సిబ్బంది


గన్‌బజార్‌లో పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్న సంక్రాంతి వెంకటకృష్ణ, ఆర్ఓ ముక్కంటి

బిషప్ జయరావు సేవలు అసామాన్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు కథోలిక పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు పేదలకు అందించే సేవలు అసామాన్యమైనవని పలువురు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఏలూరు కథోలిక పీఠాధిపతి, విశాఖ అగ్రపీఠ అపోస్తలిక పాలనాధికారి బిషప్ జయరావు 32వ గురుత్వ వార్షికోత్సవాలు మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ తదితర ప్రముఖులు హాజరై బిషప్‌కు గురుత్వ పట్టాభిషేక శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ఆధ్యాత్మిక సిరులు కురిపించి, మత సామరస్యానికి పెద్దపీట వేస్తూ సమాజంలో శాంతి స్థాపనకు జయరావు చేస్తోన్న కృషిని ప్రశంసించారు. తొలుత స్థానిక గ్జేవియర్ నగర్‌లోని అమలోద్భవి కథీడ్రల్ చర్చి ఆవరణలో జయరావుకు విశ్వాసులు, ఫాదర్లు ఘన స్వాగతం పలికారు. పలువురు గురువులతో దివ్య బలి పూజ సమర్పించారు. పలువురు గురువులు, మతకన్యలు, విశ్వాసుల సమక్షంలో పీఠాధిపతిని సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని వికార్ జనరల్ ఫాదర్ పి.బాల, ఛాన్సలర్ ఫాదర్ బాబు జార్జి, విచారణ కర్తలు ఫాదర్ మైఖేల్ ఇంజమాల, మేత్రాసన కోశాధికారి ఫాదర్ బి.రాజు, పినకడిమి డెంటల్ కాలేజ్ కరెస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, జాలిపూడి విచారణకర్తలు, దెందులూరు విచారణ కర్తలు ఫాదర్ అమ్మన్న రాజా, సెక్రటరీలు ఫాదర్ స్టీఫెన్, పలువురు గురువుల పర్యవేక్షణలో నిర్వహించారు.


బిషప్ జయరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

జగన్ పాలనకు మద్దతు ఇవ్వండి

ఏలూరు రూరల్ : సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కార్పొరేటర్ తంగెళ్లరాము కోరారు. బుధవారం ఏలూరు నగరం ఆముదాల అప్పలస్వామి కాలనీ, వడ్డెర కాలనీలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో ఎన్నడూ చూడని సంక్షేమ పథకాలు అమలయ్యాయని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గంలో సైతం పేదలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ప్రతి కుటుంబంలో ఇద్దరు లేక ముగ్గురు సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఇంటింటా ప్రచారంలో కనిపిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. వీరంతా మరో ఐదేళ్లపాటు పథకాలు కొనసాగాలని కోరుతున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీకే పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వివరించారు. బీసీ నాయకులు బొడ్డేపల్లి రామారావు, జి.తవటయ్య, గురుగులు చిన్నారావు, కొవ్వలి ఈశ్వరరావు ఓటర్లకు పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు.


15వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నిర్వహించే క్లాసులకు జూనియర్ న్యాయవాదులు హాజరై వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయకుమార్ కోరారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్లాసులకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం ఏలూరు బార్ అసోసియేషన్ వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా అబ్బినేని మాట్లాడుతూ న్యాయవాదులు చట్టాలపై అవగాహన కలిగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఒకటో అదనపు జిల్లా జడ్జి జి.రామ్‌గోపాల్, ఏపీ బార్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యుడు బీవీ కృష్ణారెడ్డి, బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఎం నాగరాజు, ఐలూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నర్రా శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాది జి.రోనాల్డ్ రాజు, ఐలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓరుగంటి శైలజ, కామన మునిస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యుడు గెద్ద విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


తరగతుల కరపత్రం విడుదల చేస్తున్న న్యాయవాదులు

నాడు – నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

పెదపాడు: పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమగ్ర శిక్ష ఎడిషనల్ కో ఆర్డినేటర్ వీ సోమశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మండలంలోని నాడు-నేడు పథకంలో వివిధ అంశాలకు సంబంధించి పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు జమ అయిన సొమ్మును ఖర్చు చేయాలన్నారు. ఎస్-2 పరీక్షలకు విద్యార్థులను సమాయత్తం చేయాలన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మధ్యాహ్నం భోజనంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రానున్న విద్యా సంవత్సరానికి విద్యాకానుక కిట్లు రానున్నాయని వాటిని ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు ఈనెల 23న చివరి పనిదినం కావడంతో ఆరోజుకు నాడు-నేడు పనులు పూర్తి చేయాలన్నారు. ఎంఈఓ నర్సింహమూర్తి మాట్లాడుతూ ఈనెల 10, 12 తేదీల్లో టోఫెల్ పరీక్షలు నిర్వహించే పాఠశాలల్లో ఓఎంఆర్ పద్ధతిలో విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. పరీక్షను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో నాడు-నేడు ఏఈ పీ శ్రీనివాస్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	05,07,10
బెండకాయలు	20	కంద	70
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	38
కాకర కాయలు	34-40	కీరా దోస	34
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	86
బీరకాయలు (పందిరి)	40	అల్లం	170
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40	పాలకూర	10
దొండకాయలు	20	చుక్కకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	08
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	18	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	39
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు -తిరుపతి	16.00	4830	34

పేదల పొట్ట కొడతామంటే చూస్తూ ఊరుకోం

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: చంద్రబాబు కాలం చెల్లిన నాయకుడని, ప్రస్తుతం ఆయన మతి భ్రమించి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడు మండలం వట్లూరులో నేను సిద్ధం మాఊరు సిద్ధం కార్యక్రమం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ఆళ్ల సతీష్‌చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు మాట్లాడుతూ పేదలను ఇబ్బందులకు గురిచేస్తూ, వారి పొట్ట కొడతామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తొలుత ఆర్‌సీఎం చర్చిలో చర్చిఫాదర్ అబ్బయ్యచౌదరిని ఆశీర్వదించారు. అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ఉదయానే పింఛన్లు అందిస్తున్న వలంటీర్లపై ప్రతిపక్షాలు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. గ్రామాల్లో ప్రజలు అన్నీ గమనిస్తున్నారని కొద్దిరోజుల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. చంద్రబాబు దుర్బుద్ధి కారణంగా ఎందరో పింఛన్‌దారులు కార్యాలయాల వద్ద పడిగాపులు కాచి ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. కూటమికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. పచ్చ బ్యాచ్ రకరకాల వేషాలు వేస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని చెప్పారు. ప్రజలు వారి మాయ మాటలు నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ చంద్రబాబు పెత్తందార్లకు, కార్పొరేట్ వర్గాలకు మాత్రమే అండగా నిలబడతారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన నిలబడే వ్యక్తి కొనియాడారు. ప్రజలంతా ముఖ్యమంత్రిగా మరలా జగన్‌మోహన్‌రెడ్డినే కోరుకుంటున్నారని చెప్పారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, స్థానిక ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు స్థానిక సర్పంచ్ గుజ్జుల రత్నకుమారి, ఎంపీటీసీ త్సవలం కనకదుర్గ, ఉపసర్పంచ్ చింతా మధుసూధనరావు, గుజ్జుల నవీన్ పాల్గొన్నారు.


వట్లూరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి